# మంచుకోకిల

ఒకటా... రెండా... ముప్పై వసంతాలు కదిలిపోయాయి. అయినా కోకిల పాడలేదు. ఎందుకు?

అవును ఎందుకు పాడలేదు? రాగమే తెలియని కోకిలని చూసి పాట పాడుతుందని భ్రమపడ్డానా? భ్రమా?

లేదు. నే భ్రమ పడలేదు. భ్రాంతిలో బ్రతకలేదు. అయినా ఆ విషయం ఖచ్చితంగా నిర్ణయించుకోవల్సిన రోజు ఇది. చివరిసారిగా మరోసారి గతాన్ని పర్యాలోచించాలి.

అవి నే డిగ్రీ పూర్తిచేసి శ్రీ ఇండస్ట్రీస్‌లో స్టెనోగా జాయిన్ అయిన రోజులు. ఓ రోజు వైస్ ప్రెసిడెంట్ ఇచ్చిన డిక్టేషన్ టైపు చేసింది చదువుతుంటే నాకా అనుమానం వచ్చింది. నే తప్పుగా టైప్ చేశానా? లేక వి.పి. పొరపాటుగా చెప్పారా? ఏది ఏమైనా అలా టైప్ చేసినవి పంపిస్తే వచ్చే నష్టం ముప్పై ఎనిమిది లక్షలు. వి.పి. దగ్గరికి వెళ్లి నా అనుమానం తీర్చుకుందామంటే అతడు అవుటాఫ్ స్టేషన్. అతడొచ్చే వరకు ఆగుదామంటే ఆ లెటర్ డిస్పాచ్ చెయ్యకుండా ఆపితే వచ్చే నష్టం ఎక్కువే. ఏమైతే అయిందని పొరపాటుని నేనే సరిచేసి ఆ లెటర్ డిస్పాచ్ చేసేసాను. ఆ తర్వాత నేనా విషయం మర్చిపోయాను.

ఇది జరిగిన వారం రోజులకి శ్రీ ఇండస్ట్రీస్‌నే గడగడలాడించే వి.పి. వణికిపోతూ "అమలా! ఆ లెటర్ పంపించేసారా?" అడిగాడు.

"ఏ లెటర్?"

"నే టూర్ వెళ్లేముందు మీకిచ్చిన లెటర్"

"పంపించాను" అన్నాను.

"పంపించావా?"

"ఆ... మార్చి పంపించాను."

"మార్చావా.... ఏం మార్చావ్" ఆత్రుతగా అడిగాడు.

అతడికి చూపించాను. అతడు అది చూసి పట్టరాని ఆనందంతో ఛాంబర్ నుండి బయటికి పరిగెత్తాడు.

ఆనందం ఎంత గొప్పదైనా కావొచ్చు. కాని ఆ ఆనందానికి కారణమైన వ్యక్తిని విస్మరించడం మనిషిలో చిన్న మనసుని స్పష్టంగా తెలియచేస్తుంది. వి.పి. నాకు కనీసం థ్యాంక్స్ కూడా చెప్పకపోవడంతో అతడంటే నాకు గౌరవం తగ్గింది. వి.పి. వెళ్లిన అరగంటకి అటెండర్ వచ్చి "మిమ్మల్ని ఎం.డి. గారు పిలుస్తున్నారు" అన్నాడు.

నే యం.డి. ఛాంబర్ కి వెళ్లాను. అదే తొలిసారి అతడిని చూడటం.

"కూర్చోండి" అన్నాడు.

నే కూర్చున్నాక "ఇంతకుముందు ఎక్కడ పనిచేశారు" అడిగాడు.

"ఇదే మొదటి ఉద్యోగం" అన్నాను.

"నే ఈరోజు ఉదయమే ఆ క్యాసెట్ విన్నాను. వెంటనే వి.పి. గారిని అడిగితే ఆయన అసలా పొరపాటునే చూడలేదు అన్నారు. సంతకం పెట్టేముందు ప్రతి ఉత్తరం చదవాలి. కాని వీళ్లు అప్పుడప్పుడూ చదవరు. థేంక్యూ" అన్నాడు ఎం.డి.

"వర్క్ లో ఎప్పుడూ ఇలాగే ఇంట్రస్ట్ చూపించండి" అన్నాడతడు.

నే బయటికి వచ్చేశాను.

లెటర్స్ డిక్టేట్ చేస్తున్నప్పుడే అవి రికార్డ్ చేస్తారు. ఆ క్యాసెట్స్ ఎం.డి.కి ఇస్తారు. అతడు అవి వింటాడు.

ముప్పై రెండేళ్ల ఎం.డి. పారిశ్రామిక రంగంలో నెంబర్ వన్ స్థాయికి చేరుకోవాలని కృషి చేస్తున్నాడు. చాలా బిజీ. అటువంటి వ్యక్తి నాతో మాట్లాడటం, అభినందించడం, నిజంగా మనసు జాజిపూల పల్లకిలో వూరేగుతున్నట్టుంది.

పనిచెయ్యాలి. ఎం.డి. మెప్పు పొందాలి. అతడిని చూడాలని ఆరాటపడే మనసుని అదుపులో పెట్టి పనిపై ఏకాగ్రత పెంచుకున్నాను. అతడిని చూడాలంటే పనిచెయ్యాలి. ఆపని అతడి మెప్పుని పొందాలి. అప్పుడే అతడు అభినందిస్తాడు.

ఆనాటినుండి ఆఫీసులో ఉదయం అడుగిడుతున్నప్పుడు అతడు పిలుస్తాడని ఆశపడే మనసులో చిన్ని ఉద్వేగం. ఆ ఉద్వేగం కలిగించిన ఆనందం. సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు "రేపు పిలవచ్చుననే ఆశ. ఆ ఆశ కలిగించే ఆనందం. ఆశ నిరాశగా మారదు అని నిశ్చయంగా తెలిసేంతవరకు ఆశ ఆనందాన్నే ఇస్తుంది.

"వి.కె. ఇండస్ట్రీస్ లో వేకెన్సీస్ ఉన్నాయట. ఆదివారం పేపర్ లో అపాయింట్ మెంట్స్ కాలమ్ లో వేశారట. అప్లై చేయి" అన్నాడు నాన్న.

"ఆ"

"జీతం ఎక్కువిస్తారా?" అడిగింది అమ్మ.

"అది స్టేట్ గవర్నమెంట్ అండర్ టేకింగ్ కంపెనీ. జాబ్ సెక్యూరిటీ ఉంటుంది" అన్నాడు నాన్న.

నేనా పోస్ట్‌కి అప్లై చెయ్యలేదు. చేశానని ఇంట్లో అబద్దం చెప్పాను.

ఉద్యోగం మారితే ఎం.డి.ని చూడటం ఎలా?

ఏమిటి నాకీ పిచ్చి?

అతడు వివాహితుడు. పిల్లలు ఉన్నారు. అతడిపై అభిమానం ఏమిటి? వివాహితుడైతే నాకేం? పిల్లలు వుంటే నాకేం? నాక్కావల్సింది నా పనిని అతడు మెచ్చుకోవడం. ఓ సంవత్సరం గడిచింది.

★ ★ ★

ఓరోజు ఉదయం నే తీరిగ్గా కంపెనీ బ్యాలన్స్ షీట్ చదువుతున్నాను. ఎం.డి. పిలిచారు అని చెప్పాడు అటెండరు. ఆనందాన్ని అదిమిపెట్టి అల్లరి మనసుని జోకొట్టి నిర్వికారాన్ని అరువు తెచ్చుకొని అతడి ఛాంబర్‌లో అడుగు పెట్టాను.

"బాగున్నారా?" అడిగాడు ఎం.డి.

"ఆ"

ఇతని స్వరం ముందు ఏ కోయిలా నిలవదు. కోటి కోయిలల స్వరమాధురి. అలవోకగా జాలువారే అభిమానం.

"యు.కె. నుండి ఓ ఇంపార్టెంట్ పర్సన్ వచ్చారు. ఓ వారం ఉంటారు. అతడిచ్చే డిక్టేషన్ తీసుకోండి" అన్నాడు.

"ఊ" అని నే బయటికి వచ్చేశాను.

★ ★ ★

"సిద్ధాంతం సంబంధం స్థిరపర్చమని మామయ్యకి ఉత్తరం రాశాను" అంది అమ్మ.

"నన్నడక్కుండా ఎందుకు రాసావ్?" విసుగ్గా అడిగాను.

"నిన్ను అడిగి నీ పెళ్లి ఈ జన్మలో చెయ్యలే" అంది అమ్మ.

"ఇప్పుడు నా పెళ్లికేం తొందర?"

"అమలా! నువ్వాట్టే గోల చెయ్యకు. పెళ్లి అంటేనే గొప్ప గోల చేస్తావు. ఏం తక్కువ ఆ సంబంధానికి? అబ్బాయి డాక్టర్. అమెరికాలో వున్నాడు. అత్త, ఆడపడుచు పోరు లేదు. కట్నం లేదు. నువ్వేం చెప్పినా నే వినను" అంది అమ్మ మొండిగా.

పెళ్లి చేసుకుంటే ఈ దేశం విడిచిపోవాలి. మా ఎం.డి.ని చూడటం కుదరదు. దేశంలో పనిచేసే కుర్రాడిని చేసుకున్నా ఉద్యోగం మానెయ్యాలి. అసలీ పెళ్లి గొడవే నా జీవితంలో నుండి తొలగించేస్తే ఉద్యోగం మానెయ్యాల్సిన అవసరం రాదు.

"నే పెళ్లి చేసుకోను" ఖచ్చితంగా చెప్పాను.

"ఎందుకు?" అడిగింది అమ్మ.

కోయిల ఆలపించే ఆమని రాగం విన్న ఓ ప్రత్యూషంలోనో, సాయం సంధ్యలోనో, నిశిరాత్రి వేళో అతడి మదిలో నాపై మెల్లమెల్లగా శృతి చేసుకుంటున్న అనురాగం అతడు వ్యక్తపరిస్తే ఏ బంధాలు అడ్డురాకూడదు ఆ రాగం ఆస్వాదించడానికి. అందుకే పెళ్లొద్దు.

ఇలా నా ప్రతి కదలికా, ప్రతి నిర్ణయం చివర వుండేది అతడిపై ప్రేమే. నా ఈ ప్రేమని వ్యక్తపర్చే అవకాశం నాకొస్తుందా?

రూపం, రంగు, సువాసనా ఏమీలేని ప్రేమని మరో వ్యక్తి ఎలా గుర్తిస్తాడు? హృదయంలో ఉద్భవించి జీవితంలో పులకరింతల పొదరిళ్లు నేసే ప్రేమ తన ఉనికిని ఎదుటి వ్యక్తికి ఎలా తెలియచేస్తుంది?

★ ★ ★

"కెవ్వ్... కెవ్వ్... కె....

"ఏమైంది?"

"అమలా!"

"ఏంటా కేక?" అంటూ నా మంచం చుట్టూ చేరిన ఇంటి సభ్యులని చూస్తుంటే నాకు తెరలు తెరలుగా నవ్వు వస్తోంది. ఇదేంటి నేనిలా అరిచాను. చాలా పెద్దగా అరిచానా? అరిచే ఉంటాను. లేకపోతే మత్తు నిద్రలో వున్నవాళ్లంతా క్షణంలో నా మంచం చుట్టూ ఎలా చేరుతారు?

"మంచినీళ్లు తాగు" అంటోంది వదిన గ్లాసు అందిస్తూ.

"పీడకల వచ్చిందా?" అడిగింది ఆత్రంగా అమ్మ.

"ఆ".

"అబ్బా! ఏం గాబరా పెట్టావే?" అంది నానమ్మ.

అంతా వెళ్లి పడుకున్నారు.

పీడకలా? కల రావడానికి నేనసలు నిద్రపోతేగా? ఈరోజు సాయంత్రం ఎం.డి. పిలిచి నాకో కవర్ ఇచ్చి "యు.కె. పర్సన్ మీకు ఇమ్మన్నారు" అన్నాడు.

"ఆయన వచ్చారా?" అడిగాను.

"లేదు. నే వెళ్లాను. ఈరోజే వచ్చాను. మీకు ఇవ్వమని ఇచ్చారు. పోస్ట్‌లో పంపించాలను కున్నారట. నేనొస్తున్నానని తెలిసి నాకిచ్చారు" అన్నాడు ఎం.డి.

"మీ ఇల్లు ఎక్కడ?" అడిగాడతడు.

"మంజీరా నగర్".

"ఎవరెవరుంటారు?"

"అమ్మా, నాన్న, అన్నయ్య, వదిన, నానమ్మ" అన్నాను.

"సిస్టర్స్ లేరా?"

"ఉంది. పెళ్లయింది".

"మీరింకా పెళ్లి చేసుకోలేదేం?"

కారణం చెబితే నా పళ్లు ఊడగొట్టేస్తారు అనుకొని ఓ నవ్వు నవ్వాను.

నే బయటికి వచ్చాను. అప్పుడేం అన్పించలేదు. కాని ఇప్పుడనిపిస్తోంది అతడీరోజు నన్ను పని గురించి ఏం అడగలేదు. వ్యక్తిగత విషయాలు అడిగాడు. ఓ వ్యక్తి మరో వ్యక్తి పర్సనల్ లైఫ్‌లోకి ఎప్పుడు తొంగి చూస్తాడు? ఆ వ్యక్తిపట్ల, ఆసక్తి, అభిమానం వుంటే.

కొంతమంది కాలక్షేపం కోసం అలా అడుగుతారు. కాని ఎం.డి. డిక్షనరీలో కాలక్షేపం అనే పదం లేదు. అతడికి నాపై ఆసక్తి వుంది అనే ఆలోచన అప్రయత్నంగా అంత పెద్దకేక పెట్టించింది. ఆరాత్రి నాకింక నిద్ర పట్టలేదు.

★ ★ ★

సాయంత్రం ఆరు గంటలు. వదిన తన కూతురికి చదువు చెబుతోంది. వసంత ఋతువు గురించి చెబుతూ "వసంతంలో కోయిలలు పాడును" అంది.

"వసంతకాలం అంటే ఏమిటమ్మా?" అడిగింది.

"ఎండాకాలం మొదటి రోజుల్ని వసంతకాలం అంటారు" అంది వదిన.

"కోయిల చలికాలంలో ఎందుకు పాడదమ్మా?" అమాయకంగా అడిగింది పాప.

"చలికాలంలో కోయిల మంచు బాగా తాగుతుంది. గొంతు పాడై పాడదు" అంది వదిన.

నే వదినవైపు చూశాను. ఆమె నావైపు చూసి నవ్వుతూ "నీ మేనకోడలి సందేహాలకి జవాబులు చెప్పి చెప్పి నేనో రైటర్ని అయ్యేట్టున్నాను" అంది.

నే నవ్వలేదు.

"నీకు సరైన జవాబు తెలుసు అది చెప్పు" అన్నాను. ప్రశ్నలు వేసే పిల్లల్ని విసుక్కున్నా, తప్పు జవాబు ఇచ్చినా నాకు నచ్చదు. జవాబు తెలియకపోతే తెలుసుకొని నిజమైన జవాబు చెప్పాలి కాని పిల్లల ప్రశ్నలని నిర్లక్ష్యం చెయ్యటం నాకిష్టం ఉండదు.

చలికాలంలో మంచు తాగి కోయిల పాడదు. మరి నా కోయిల కంటికి కన్పించట్లేదు. రాగం వినిపించట్లేదు.

జీవనరాగంలో అన్ని రాగాలని నిర్దాక్షిణ్యంగా తప్పించాను. ఈనాడు ఒంటరిగా నా గూటిలో మిగిలిపోయాను. శాశ్వత రాగాలు ఆశించలేదు. అయినా నా ఆశ ఆశగానే మిగిలిపోయింది.

ఐ లవ్ యు అనేంత గొప్ప భావం అతనికి నాపై కలగక పోవచ్చు. కాని రవ్వంత ఆప్యాయతకి నోచుకోలేదా?

అతడికి నాపై ఏంలేదా? ఉద్యోగులందరితోనూ మాట్లాడినట్లే అతను నాతో మాట్లాడాడా? అదంతా వ్యాపారంలో ఓ భాగమేనా? వ్యాపారంలో ప్రతిభకి లభించే గుర్తింపుని చూసి నేనో వెర్రిపిల్లలా నాపై ఆప్యాయత అనుకొని మురిపాల ముచ్చట్లు మనసు ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దేసుకున్నాను.

ఇందులో అతడి తప్పు ఏముంది?

అతడిని ప్రేమించడం ఓ తప్పు. ఏనాడూ ఆ ప్రేమని అతడి దగ్గర వ్యక్తపరచకపోవడం మరో తప్పు. తప్పంతా నాదే.

★ ★ ★

ఆ గతం నుండి వర్తమానానికి వస్తే విశేషం ఏమిటంటే ఈరోజు నాకు ఫేర్ వెల్ ఇస్తున్నారు.

ఏభై ఎనిమిది సంవత్సరాలు నిండాయి.

ముప్పై ఎనిమిదేళ్ల సర్వీసులో నే సాధించిందేంటి? ఆశల తోరణాలు శూన్యంలో కట్టాను.

"ఓ లిమిటెడ్ కంపెనీలో కెరీర్ ప్రారంభించి అదే కంపెనీలో రిటైర్ అయ్యేంతవరకు పనిచేయడం చాలా అరుదైన విషయం. ఏ శక్తి మిమ్మల్నింతకాలం ఇక్కడ నిలిపింది. మీ అనుభవాలు చెబితే ఇప్పుడిప్పుడే ఉద్యోగాలలో ప్రవేశించిన వాళ్లకి ఉపయోగపడవచ్చు" అన్నాడు మైక్ ముందు నిలబడి కల్చరల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ.

నా ముందుకి మైక్ తెచ్చి పెట్టారు.

"ముప్పై ఎనిమిది సంవత్సరాల క్రితం ఇక్కడ నేను నా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాను. ప్రతీ వ్యక్తి జీవితాన్ని రాగరంజితం చేసే అంశం ఒకటుంటుంది. కొందరు గుర్తింపు కోసం శ్రమపడతారు. ఇంకొందరు డబ్బు కోసం తాపత్రయపడతారు. ఎవరు ఎందుకోసం శ్రమించినా అందరి ధ్యేయం తృప్తిగా బ్రతకాలని. తృప్తి అన్నది ఏ నాటికైనా లభిస్తుందనే ఆశ మనల్ని చైతన్యవంతుల్ని చేస్తుంది. ఇక నా విషయానికి వస్తే నే గుర్తింపు కోసమో, డబ్బు కోసమో శ్రమించలేదు. ఈ రెండింటి కోసం శ్రమించి ఫలితాలు చూపించిన అందరికంటే ఉన్నత ప్రమాణాలు నే ఆశించిన విషయం వలన సాధించాను. నా ఆశ నిరాశ అయి వుండొచ్చు. అది వ్యక్తిగతం. కాని ఈ పరిశ్రమకి మేలు చేసింది. సొంత పాపలా చూసుకునేట్టు చేసింది. ప్రపంచంలో ఏ విషయంలోనైనా ఉన్నత ప్రమాణాలు సాధించాలంటే మేధస్సు, అధికారం, ఉత్సాహంతోపాటు ఖచ్చితంగా ఉండాల్సినది మరోటి ఉంది. అదే నన్నీ స్థలంలో ఇన్నేళ్లు నిర్విరామంగా శ్రమింప చేసింది" ఉద్వేగంతో నా స్వరం వణుకుతోంది. అనుబంధం మాటల్లో జాలువారితే ఏదో తెలియని బంధం కనురెప్పల చాటునుండి జలజల రాలిపడుతోంది.

ప్రేమించబడితే మనసు మందాకిని.

ప్రేమిస్తే హృదయం సముద్రపు ఉప్పెన.

"ఖచ్చితంగా ఉండాల్సింది ఏమిటి మేడమ్" అడిగిందో అమ్మాయి.

"ప్రేమ" అన్నాను.

ఇన్నేళ్లూ నేనో మంచు తాగిన కోయిలని. కాని ఈనాడు నిరాశ మంచుని కరిగించేస్తుంటే ఆలాపన నింగిని చేరాలనే ఉబలాటంతో "ప్రేమతో సంస్థనో, పనినో, ఊరినో, డబ్బునో ప్రేమిస్తే మంచి ఫలితాలు వస్తాయి. వ్యక్తిగతంగా తృప్తి ఉంటుంది" అన్నాను.

"మీరే విషయాన్ని ప్రేమించారు" అడిగాడో అబ్బాయి.

"ఐ లవ్ హిమ్" ఆనాటి ఎం.డి. (ఇప్పుడు ఛైర్మన్) వైపు చూస్తూ సర్వ ప్రపంచాన్ని మరచి సర్వ ప్రపంచం ముందు సత్యాన్ని నిర్భయంగా, స్పష్టంగా చెప్పాను. స్టేజ్ దిగాను. అడుగులు వేస్తున్నాను. అలసిన సంధ్యావాల్చిన కన్రెప్పల వాలు నుండి జారిన కాంతిలా మెల్లమెల్లగా అడుగులేస్తూ శ్రీ ఇండస్ట్రీస్ ఆవరణనుండి వెలుపలికి అడుగు పెట్టాను.

• *ఉదయం ఆదివారం, 14, మే 1989* •